RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 433 | 26 ఆదివారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## రాహుల్ పోరాటం, విద్యార్థుల ఐక్యత వల్ల

# కేంద్రం దిగివచ్చింది

**: పొన్నం ప్రభాకర్**



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, ఉద్యమకారుల విజయమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇది అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపని ఆయన అభివర్ణించారు. రాహుల్ గాంధీ పోరాటం, దేశవ్యాప్తంగా విద్యార్థులు చూపిన ఐక్యత వల్ల కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దనే బలమైన గుణపాఠం కేంద్రానికి దక్కిందని స్పష్టం చేశారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పతనానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే మొదటి మెట్టు అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, మెట్రో సేవలు బంద్ చేసి, లాఠీ ఛార్జీలు జరిపినా వెరవకుండా వేలాది మంది విద్యార్థులు ధర్నాలో పాల్గొనడం కేంద్రంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. ఉద్యమించి విజయం సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజావ్యతిరేక విధానాలపై ఇదే రీతిలో ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యార్థుల ఐక్యతను చూసి

# గర్విస్తున్నాను

**: రాహుల్ గాంధీ**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశంలో విద్యా వ్యవస్థను తిరిగి సరైన మార్గంలో పెట్టేందుకు ఈ పరిణామం ఒక పెద్ద అడుగు అని అభివర్ణించారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడిన ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని విడుదల చేశారు. విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించారు.మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకొన్నప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులు, దేశ భవిష్యత్తును గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన హింసకు, లాఠీఛార్జీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే రెండు ముఖ్యమైన డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. బాధ్యులైన ప్రతీ ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని ఉద్ఘాటించారు.ఈ ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురైన రైతులు, కూలీలు, పేదలు, ఇతర వర్గాల ప్రజలందరూ తమ ఆత్మగౌరవం కోసం రాజ్యాంగబద్ధంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని రాహుల్ పిలుపునిచ్చారు. అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడటంలోనే అసలైన నిరసన బలం ఉందన్నారు.



ఈ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ, "ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నారు.

# ఇది యువత సాధించిన విజయం


## : ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రియాంక గాంధీ



నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని ఆమె స్పష్టం చేశారు. శనివారం తన లోక్‌సభ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని తెలిపారు. "గత పది, పన్నెండేళ్లుగా మన యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని నేను అనేకసార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నేడు దేశ యువత గళం విప్పింది, వారి గొంతు వినిపించింది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు.ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తూ, "ఆర్ఎస్ఎస్ తన భావజాలంతో మొత్తం విద్యా వ్యవస్థను నింపేస్తోంది. మన పూర్వీకుల సిద్ధాంతాలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించారు. అయితే, ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి పాలకుడూ ఈ ఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రోజు మన దేశాన్ని మనం తిరిగి నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు.నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు ఉధృతంగా జరిగాయి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు.


# బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించాలి

ఆలయాల పాలకమండళ్లలో చోటు ఇవ్వాలి:బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్



రాష్ట్రంలోని అన్ని దేవాలయాల పాలకమండళ్లలో కనీసం ఒక బ్రాహ్మణుడికి ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బొగ్గులకుంటలోని బ్రాహ్మణసంక్షేమపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అర్హులైన బ్రాహ్మణులు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన బ్రాహ్మణులు 'సర్' ఫారమ్‌లు పూర్తి చేసి అధికారులకు అందజేయాలని కోరారు.సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ ఉద్యమకారుల వివరాలను సేకరించి ఉద్యమ గుర్తింపు కమిటీ చైర్మన్ కే కేశవరావుకు సమర్పిస్తామని చెప్పారు. ఉద్యమకారులందరూ తమ వివరాలు స్వయంగా సమర్పించుకునేలా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టాలని కమిటీకి సూచించామని వెల్లడించారు. బ్రాహ్మణ సంక్షేమం, సాధికారత, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పనిచేస్తున్నదని, ప్రభుత్వం అమలు చే స్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ బ్రా హ్మణ కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని బసవరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు.

# దేశంలో మార్పు మొదలైంది



'దేశవ్యాప్తంగా సమాజంలో ఒక సరికొత్త వైఖరి, మార్పు ప్రారంభమైంది. అది ఇప్పుడు ప్రత్యక్షంగా కనిపిస్తున్నది' అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో ఎక్స్ వేదికగా శనివారం ఆయన పెట్టిన ఆసక్తికర పోస్ట్ రాజకీయ వర్గాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.దేశ భవిష్యత్తును నిర్దేశించేది యువశక్తేనని, వారు అనుకొన్నది సాధించి తీరుతారనడానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పోరాడిన యువతకు, ఇతర వర్గాలకు హృదయపూర్వక అభినందనలు అని పేర్కొన్నారు. హరీశ్‌రావు పోస్టు క్షణాల్లోనే వైరల్ అయింది. యువత, ఆయన మద్దతుదారులు ఈ ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ తమ మద్దతు ప్రకటించారు. సమాజంలో సరికొత్త ఆలోచనలు, యువశక్తికి ప్రాధాన్యం పెరగడానికి ఈ రకమైన సానుకూల ధోరణి ఎంతగానో తోడ్పడుతుందని నెటిజన్లు తమ కామెంట్లతో అభిప్రాయాలు వ్యక్తంచేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై బండి సంజయ్..

# 'దేశమే ముందు' అని ప్రశంస



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. ఇది బీజేపీ అనుసరించే "దేశం మొదట, పార్టీ తర్వాత, వ్యక్తిగతం ఆఖరు" అనే మూల సిద్ధాంతానికి నిదర్శనమని ఆయన శనివారం పేర్కొన్నారు.పదవులు శాశ్వతం కాదని, ప్రజల విశ్వాసమే అత్యంత కీలకమని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. విద్యార్థి ఉద్యమ నేత స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతల వరకు ధర్మేంద్ర ప్రధాన్ దశాబ్దాలుగా దేశానికి అందించిన సేవలను కొనియాడుతూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే ప్రజల గొంతుకను వినడం, వారి అభిప్రాయాలను గౌరవించడమేనని బండి సంజయ్ వివరించారు. క్లిష్ట సమయాల్లో బాధ్యతను స్వీకరించే ధైర్యం ప్రదర్శించడమే నిజమైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురైన అవకతవకలపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో, ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఆయన నైతిక విలువలకు నిదర్శనమని కొనియాడారు.నీట్-యూజీ సహా పలు పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. ఈ పరిణామాల మధ్యే ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన రాజీనామా లేఖను సమర్పించారు. కాగా, ఇది ప్రజాస్వామ్య పోరాట ఫలితమని, యువత ఉద్యమానికి లభించిన విజయమని ప్రతిపక్ష నేతలు అభివర్ణిస్తున్నారు.

# డిమాండ్లను అంగీకరించిన కేంద్రం...

## నిరసన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో గత కొన్ని వారాలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తమ నిరసనను విరమించింది. తమ ప్రధాన డిమాండ్ అయిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు, ఇతర డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రులు, సీజేపీ ప్రతినిధులు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం... కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ లతో సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా మరో దఫా చర్చలు జరిపారు. చర్చలు ముగిసిన అనంతరం జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు అంగీకరించిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్న సద్భావనతో నిరసనను తక్షణమే విరమిస్తున్నట్లు వారు తెలిపారు. తమ మద్దతుదారులంతా శాంతియుతంగా ఇళ్లకు తిరిగి వెళ్లాలని పిలుపునిచ్చారు.మంత్రి రాజీనామాతో పాటు, ప్రభుత్వం మరికొన్ని కీలక హామీలు ఇచ్చినట్లు సీజేపీ నేతలు వెల్లడించారు. నీట్ ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఉపసంహరించుకుంటామని, భవిష్యత్తులో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అలాగే, నీట్ వ్యవహారంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం గరిష్ఠ పరిహారం అందజేస్తామని స్పష్టం చేసిందని వివరించారు.ఈ సందర్భంగా సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరించింది. కాబట్టి ఆందోళన చేస్తున్న వారందరూ తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని కోరుతున్నాం" అని అన్నారు. అశుతోష్ రంకా మాట్లాడుతూ, "36 రోజుల నిరసన తర్వాత ప్రభుత్వం దిగివచ్చింది. మా డిమాండ్లు తీవ్రమైనవి కావు, చాలా సాధారణమైనవి. ఇప్పుడు ప్రభుత్వం వాటిని ఆమోదించింది" అని పేర్కొన్నారు.



RNI No Tel / 2012 /4241
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

# జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రైతులతో అనుసంధానం చేయాలి

## – గ్రామాల్లో మద్య నియంత్రణను కఠినంగా అమలు చేయాలి

## – జాతీయ గ్రామీణ స్థితిగతుల కమిటీ ఛైర్మన్ వీస్ విజయ్ వర్మ పాకలపాటి

అలీగఢ్ (ఉత్తరప్రదేశ్), జూలై 25: గ్రామ పంచాయతీలను ఆర్థికంగా, పరిపాలనా పరంగా బలోపేతం చేయడంతో పాటు గ్రామాలను గ్రామ స్వరాజ్యం దిశగా తీర్చిదిద్దితేనే గ్రామీణ భారత్ స్వయం సమృద్ధిని సాధిస్తుందని ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ 19వ జాతీయ సదస్సు కార్యవర్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలీగఢ్‌లో నిర్వహించిన 19వ జాతీయ సదస్సులో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి సుభోద్ కాంత్ సహాయ్ మాట్లాడుతూ, రాజ్యాంగంలోని 73వ, 74వ రాజ్యాంగ సవరణలు ఇప్పటికీ అనేక రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో అమలుకాకపోవడం ఆందోళనకరమని అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన అధికారాలు, నిధులు, విధులను సమర్థంగా అమలు చేయకపోతే గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ జాతీయ కార్యదర్శి, దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త, జాతీయ గ్రామీణ స్థితిగతుల కమిటీ ఛైర్మన్ వీస్ విజయ్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాల్లో గ్రామ పంచాయతీల పరిస్థితిపై నిర్వహించిన అధ్యయనంలో అధిక సంఖ్యలో సర్పంచులు నిధుల లేమితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేని పరిస్థితి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా కూడా కొనసాగుతోందని పేర్కొంటూ, కేవలం చెక్ పవర్ ఇవ్వడం సరిపోదని, స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులను సకాలంలో విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.ప్రస్తుతం సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడటంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించలేక అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక సంస్థలకు సంపూర్ణ అధికారాలు, ఆర్థిక స్వయం ప్రతిపత్తి కల్పించినప్పుడే మహాత్మా గాంధీ ఆశయమైన గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా గ్రామాల్లో అడుగడుగునా పెరుగుతున్న మద్యం దుకాణాల కారణంగా యువత మద్యానికి బానిసలుగా మారి, దేశాభివృద్ధికి ఉపయోగపడాల్సిన ఒక తరం నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ సమాజ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మద్య నియంత్రణను కఠినంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులతో అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయానికి అవసరమైన పనులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయడం ద్వారా రైతులకు ఉపశమనం కలుగుతుందని, లేకపోతే రైతాంగం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ భారత్ సుభిక్షంగా ఉండాలంటే వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం మరియు మద్య నియంత్రణ అనే రెండు



అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యంతో చర్యలు చేపట్టాలని కోరారు.న్యూఢిల్లీలో తెలంగాణ పంచాయత్ పరిషత్ భవన నిర్మాణానికి ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ సముదాయంలో స్థలం కేటాయించాలని వీస్ విజయ్ వర్మ పాకలపాటి, తెలంగాణ పంచాయత్ పరిషత్ అధ్యక్షుడు ఎం. ఎ. జలీల్, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలిక అధ్యక్షురాలు ఝాన్సీ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.ఈ జాతీయ సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి తెలంగాణ పంచాయత్ పరిషత్ అధ్యక్షుడు ఎం. ఎ. జలీల్, ఆంధ్రప్రదేశ్ పంచాయత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు చిదంబరం రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలిక అధ్యక్షురాలు ఝాన్సీ, ఇటీవల ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ జాతీయ



కార్యదర్శిగా నియమితులైన పి. సత్యనారాయణ, తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు హాజరయ్యారు.

దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించిన ఈ సదస్సులో ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డా. అశోక్ చౌహాన్, ఉపాధ్యక్షుడు ధ్యాన్‌పాల్ సింగ్, ప్రధాన కార్యదర్శి అనిల్ శర్మ, కేంద్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల సమస్యల పై రేపే “ఛలో పార్లమెంట్‘

## - జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా

## - ఢిల్లీకి బయలుదేరిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు, జర్నలిస్టులు



హైదరాబాద్,జూలై 25: కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై రేపే తెలంగాణ జర్నలిస్టులు “ఛలో పార్లమెంట్“ కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒకరోజు ధర్నా చేయడానికి ఏర్పాట్లు జరిగాయి.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు ఇప్పటికే ఢిల్లీకి బయలుదేరారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శనివారం ఢిల్లీ బయలుదేరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకు వెళ్ళి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ,తాము తొలిసారిగా “ఛలో పార్లమెంట్“ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.

ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలు

జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ

దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళు కొనసాగించిన రైల్వే రాయితీ సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసింది. దీనిని పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు. ఇబ్బందులకు గురవుతున్నారు.జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

దేశ వ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో నేషనల్ మీడియా కమీషన్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

నేషనల్ పెన్షన్ స్కీం ప్రవేశ పెట్టాలి

దేశవ్యాప్తంగా రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేక పోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదు. అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జర్నలిస్టుల రక్షణ చట్టం చేయాలి

దేశంలోని అనేక రాష్ట్రాలలో జర్నలిస్టుల పై దాడులు, హత్యలు, అక్రమ కేసుల బనాయింపు వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. వీటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా కు చట్టబద్ధత కల్పించాలి,

ఎలక్ట్రానికి,డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత లేకపోవడం వల్ల అనేక సమస్యలు, అనార్ధాలు ఎదురవుతున్నాయి. వెంటనే ఈ మీడియాలకు చట్టబద్ధత కల్పించాలి.

ఇళ్ళస్థలాల పై సుప్రీం కోర్టు తీర్పును పునః సమీక్షించాలి

పాత్రికేయ సంఘాలకు, జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి తరలివెళుతున్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లతో పాటు అనేకమంది నాయకులు, సభ్యులు బయలుదేరి వెళ్ళారు.

# ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయాలి: సీఐటీయూ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 25:–
బైరాములగూడ కమ్యూనిటీ హాల్లో శనివారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ కార్మికులు, రైతులు, ప్రజల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, నగర ఉపాధి హామీ కింద 200 రోజుల పని, రోజుకు ₹600 వేతనం అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భూషరాజు, కాశయ్య, కృష్ణమూర్తి, రాథోడ్



అంజినాయక్, లక్ష్మణ్ నాయక్, యాదయ్య, రాధమ్మ, పద్మ, వెంకటమ్మ, శివలీల, రాములమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామకంఠం భూమి కోసం దండు మైలారం గ్రామ ప్రజల పోరాటం, రిలే దీక్షలు

రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం మండలం దండు మైలారం గ్రామంలో గ్రామకంఠం భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనకు అఖిలపక్ష నాయకులు, గ్రామ ప్రజలు, బీసీ–ఎస్సీ–ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామకంఠం భూమి ఆక్రమణకు గురికావడంతో పాటు బతుకమ్మ కుంట కూడా కబ్జా కావడం వల్ల గ్రామ సంప్రదాయాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు తగిన స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు తెలిపారు.

గ్రామంలో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి 120 గజాల ఇంటి స్థలం కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాల అవసరాలకు అవసరమైన భూమిని కేటాయించి విద్యా సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




గ్రామకంఠం భూమిపై జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించి, భూమిని గ్రామ ప్రజల అవసరాల కోసం వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

# కస్తూర్బా పాఠశాలలో డీసీపీ అవగాహన కార్యక్రమం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 25:–
కోతూర్: శాద్‌నగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) శ్రీమతి చ. శిరీష రాఘవేంద్ర కోతూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడిన ఆమె చదువుపై పూర్తి దృష్టి సారిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, వాటి వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.విద్యార్థినులకు సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, మహిళలు, బాలికల భద్రత, వ్యక్తిగత రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వేధింపులు, బెదిరింపులు, బుల్లీయింగ్ లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని డీసీపీ విద్యార్థినులను ప్రోత్సహించారు. అనంతరం డీసీపీ కోతూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అక్కడి పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోతూర్ ఎస్‌హెచ్‌ఓ జి. నర్సయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
26 ఆదివారం జూలై 2026

## రాయపోల్‌లో రూ.కోటితో అభివృద్ధి పనులకు శ్రీకారం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 25:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రాయపోల్ గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సుమారు రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల్లో భాగంగా గ్రామం వెలుపల తొలిసారిగా 18 అడుగుల వెడల్పుతో నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పోచమ్మ ఆలయం వరకు, నల్ల యాదగిరి గౌడ్ ఇంటి నుంచి హనుమాన్ ఆలయం వరకు, కుమ్మరి రాములు ఇంటి నుంచి ఉడుగుల గంగయ్య ఇంటి వరకు, ఎర్ర బాలరాజ్ ఇంటి నుంచి దండుమైలారం రహదారి వరకు సహా పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అదేవిధంగా గ్రామంలోని అంతర్గత రహదారులు, బైపాస్ మార్గాల అభివృద్ధి పనులు కూడా ఈ ప్రణాళికలో భాగంగా కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, గ్రామ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం, సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంకాల దాసు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## జీఎన్ఐటీలో ఘనంగా 15వ గ్రాడ్యుయేషన్ & ప్లేస్‌మెంట్ డే






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 25:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జీఎన్ఐటీ)లో 15వ గ్రాడ్యుయేషన్ & ప్లేస్‌మెంట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 714 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేయగా, విద్యా ప్రతిభ కనబరిచిన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 18 బంగారు, వెండి పతకాలను అందజేశారు.
ప్లేస్‌మెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన 583 మంది విద్యార్థులకు 205కు పైగా ప్రముఖ సంస్థలు నియామక పత్రాలు అందించాయి. మూ సిగ్మా రూ.40 లక్షలు, ప్రావిడెన్స్ గ్లోబల్ సెంటర్ రూ.14 లక్షలు, రియల్‌పేజ్ రూ.10 లక్షల వార్షిక వేతన ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు కల్పించడం విశేషం. కార్యక్రమానికి జెట్టా మైన్ ల్యాబ్స్ చీఫ్ ఏఐ ఆఫీసర్ శంకర్ వేమా, సంస్థ వ్యవస్థాపకుడు నాగ్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలు, నిరంతర అభ్యాసంతో దేశాభివృద్ధికి విద్యార్థులు తోడ్పడాలని సూచించారు. గురు నానక్ విద్యాసంస్థల చాన్స్‌లర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, వైస్ చాన్స్‌లర్ డా. హెచ్.ఎస్. సైనీ, ప్రిన్సిపాల్ డా. బి. వెంకట రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ మోడ్‌లో 'మై భారత్' నమోదు పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ కిరణ్మయి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 25:-
రంగారెడ్డి జిల్లాలో మై భారత్ (మేరా యువ భారత్) నమోదు కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో విజయవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. కిరణ్మయి కొప్పిశెట్టి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అడ్వైజరీ కమిటీ (ణూజ), జిల్లా సమన్వయ కమిటీ (ఝూజ) సమావేశంలో ఆమె జిల్లాకు నిర్దేశించిన 80,251 మంది యువత నమోదు లక్ష్యంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, యువజన సంఘాల సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, నమోదు శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కళాశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, పాఠశాలల్లో అర్హులైన ప్రతి యువకుడు మై భారత్ పోర్టల్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మై భారత్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బి. స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్ మాట్లాడుతూ, యువతలో స్వచ్ఛంద సేవా భావం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. అన్ని శాఖలు నోడల్ అధికారులను నియమించి, ప్రతిరోజూ నమోదు పురోగతిని సమీక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు, మై భారత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్నం రుక్కమ్మకు కన్నీటి వీడ్కోలు..

### - భారీగా తరలివచ్చిన ప్రజలు, రాజకీయ ప్రముఖులు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 25:-
మాజీ మంత్రి, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మకు శనివారం స్వగ్రామం గొల్లూరుగూడలో కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజలు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. రుక్కమ్మ పార్థివ దేహాన్ని తొలుత హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పట్నం మహేందర్ రెడ్డి నివాసంలో సందర్శనార్థం ఉంచగా, అనంతరం షాబాద్‌లోని మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి నివాసానికి తరలించి ప్రజల సందర్శనకు అవకాశం కల్పించారు. అక్కడి నుంచి భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర నిర్వహించి గొల్లూరుగూడలో అంత్యక్రియలు పూర్తి చేశారు. రుక్కమ్మ మృతికి రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్నం మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, ఈర్లపల్లి శంకర్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, పలువురు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.



రుక్కమ్మను ప్రేమగా "పెద్దమ్మ"గా పిలిచే గొల్లూరుగూడ, కొమరబండ, ముద్యంగూడ, బొబ్బిలిగామ తదితర గ్రామాల ప్రజలు వందలాదిగా తరలివచ్చి తుదివీడ్కోలు పలికారు. ఉమ్మడి రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కూడా నాయకులు, కార్యకర్తలు పార్టీలకు అతీతంగా హాజరుకావడంతో గొల్లూరుగూడ గ్రామం శోకసంద్రంగా మారింది.

## జిల్లా వ్యాప్తంగా 27 నుంచి 29 వరకు విత్తన మేళాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు అవకాశం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 25:-
రంగారెడ్డి: ఎల్-నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు జూలై 27, 28, 29 తేదీలలో జిల్లాలోని అన్ని మండలాల రైతు వేదికల్లో విత్తన మేళాలను నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి సుజాత తెలిపారు. జిల్లాలోని 24 మండలాల రైతు వేదికల్లో రైతులకు అవసరమైన నాణ్యమైన ఆరుతడి పంటల విత్తనాలతో పాటు వివిధ రకాల కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆమె వెల్లడించారు. కంది, పెసర, ఆముదం, సజ్జలు, ప్రొద్దుతిరుగుడు వంటి పంటల విత్తనాలను రైతులు తమ అవసరాలకు అనుగుణంగా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ ఇప్పటికే జిల్లా, మండల స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కంటింజెన్సీ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ విత్తన మేళాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటల విత్తనాలను కొనుగోలు చేసి, ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి సుజాత కోరారు.

## కాకా కుటుంబంపై మాట్లాడే నైతిక హక్కు బి ఆర్ ఎస్ నాయకులకు లేదు



హైదరాబాద్ ఎస్టేట్ 25జులై 2026
కాకా వెంకటస్వామి కుటుంబం, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పై బి ఆర్ యస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న కాకా కుటుంబానికి వస్తున్న ఆదరణను తట్టుకోలేకనే బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు. కాకా వెంకటస్వామి కుటుంబంపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో హుందాతనం పాటించకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం వారి దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. గత ఐదు దశాబ్దాలుగా కాకా వెంకటస్వామి కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు విశేష సేవలు అందిస్తోందని, ఈ ప్రాంత అభివృద్ధిలో వారి పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఇటీవల ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ యువత కోసం కనీసం 50 ఉద్యోగాలు కల్పించాలని కోరారని, ఆ వ్యాఖ్యల్లో ఎలాంటి వ్యంగ్యం లేదని స్పష్టం చేశారు. అది రాష్ట్ర నిరుద్యోగ యువత తరఫున అడిగిన న్యాయమైన ప్రశ్న మాత్రమేనని అన్నారు. ఇన్నాళ్లకు కేటీఆర్‌కు విద్యార్థులపై ప్రేమ పుట్టుకొచ్చిందని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు, 2019లో ఇంటర్మీడియట్ ఫలితాల గందరగోళం నేపథ్యంలో 25 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు వారి కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో విద్యార్థుల పక్షాన నిలవకుండా, నేడు నీతులు చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. అలాగే బీఆర్ఎస్ పాలనలో వరుసగా జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలు, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, పదో తరగతి ప్రశ్నాపత్రాల లీక్, గ్రూప్-1 పరీక్షల రద్దు, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల వాయిదాలు, వేలాది మంది నిరుద్యోగ యువతను తీవ్ర ఆందోళనకు గురిచేసిన సంఘటనలు రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు. లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడిందని ఆరోపించారు. అటువంటి పాలన సాగించిన నాయకులు ఇప్పుడు విద్యార్థుల సంక్షేమంపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన నాటి నుండి గడ్డం వంశీకృష్ణ ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, కేవలం రెండేళ్లలోనే సుమారు ₹8,000 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆ నిధులతో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని 64 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ూాజం) అభివృద్ధి చేసి ఆధునిక నైపుణ్యాలతో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. ూావీ-జూవీ ద్వారా జర్మన్ భాషలో శిక్షణ అందించి విదేశాల్లో ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే మందమర్రి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వేలాది మంది యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో సుమారు ₹500 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం బీఆర్ఎస్ నాయకులు వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. కాకా కుటుంబంపై, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పై అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాకా అభిమానులు ప్రజాస్వామ్యబద్ధంగా గట్టి సమాధానం ఇస్తారని, స్పష్టం చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం అంశాలపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, వ్యక్తిగత దూషణల రాజకీయాలను ప్రజలు తిప్పికొడతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షులు మంద సృజన, ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ కార్యదర్శులు కునారపు శివకుమార్ నాయకులు బొద్దుల ప్రేమ్ సాగర్, నాగుల రాజ్ కుమార్, ఆలేటి వెంకటేష్, రాజు, ఏల్పుల స్వామి, పింగిలి సంతోష్, మహిళా నాయకులు దీప, అనూష తదితరులు పాల్గొన్నారు

## పదోన్నతితో బదిలీపై వెళ్తున్న ఎస్సై సత్తయ్యకు ఘన సన్మానం




మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణం లోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై)గా విధులు నిర్వహించి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా పదోన్నతి పొంది, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఆదిమూలం సత్తయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్శ రమేష్, మందమరి ఎస్సై నరేష్, రామకృష్ణాపూర్ ఎస్సై జాడి శ్రీధర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ, ఆదిమూలం సత్తయ్య తన విధులను నిబద్ధత, నిజాయితీతో నిర్వహించి ప్రజలకు, శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. పదోన్నతి పొంది కొత్త బాధ్యతల్లో కూడా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సత్తయ్య సహచర అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తాను ఎక్కడ పనిచేసినా అదే అంకితభావంతో విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

# అమన్‌గల్ పోలీస్ స్టేషన్ తనిఖీ.. దర్యాప్తు నాణ్యతపై ఏసీపీ ఆదేశాలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 25:-
అమన్‌గల్: ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని అమన్‌గల్ పోలీస్ స్టేషన్‌ను మహేశ్వరం డివిజన్ ఏసీపీ ఎస్. జానకి రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పనితీరు, పెండింగ్ కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణ, దర్యాప్తు నాణ్యత, విజిబుల్ పోలీసింగ్, స్టేషన్ పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ విజిటింగ్ నోట్‌లో పోలీసు సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ సందర్భంగా అమన్‌గల్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు స్టేషన్‌లో అమలు చేస్తున్న పోలీసింగ్ విధానాలు, నేర నియంత్రణ చర్యలు, పెండింగ్ కేసుల స్థితి, ప్రజలకు అందిస్తున్న సేవలను ఏసీపీకి వివరించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, నాణ్యమైన ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఏసీపీ సూచించారు. ముఖ్యంగా



గ్రేవ్ (యూఐ) కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను త్వరితగతిన గుర్తించాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో సైబర్ మోసాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, సీసీటీఎన్ఎస్, ఈ-సాక్షి వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని పేర్కొన్నారు మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ భద్రత, రోడ్డు భద్రతపై నిరంతరం ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, హరితవనంగా ఉంచుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా ఆదేశించారు. చివరగా ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని ఏసీపీ ఎస్. జానకి రెడ్డి సూచించారు.

# పార్టీ ఫౌండేషన్ డే వేడుకల కోసం ముంబైకి బయలుదేరిన డాక్టర్ పిట్టా వరప్రసాద్‌కు ఘన వీడ్కోలు

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ, జూలై 25:
రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) పార్టీ ఫౌండేషన్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ముంబైకి బయలుదేరిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ గారికి కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో పార్టీ నాయకులు, మిత్రులు ఘనంగా సెండ్ ఆఫ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ కొమ్మన తాతారావు గారు, నాయకులు కొల్లేపల్లి సతీష్ గారు డాక్టర్ పిట్టా వరప్రసాద్ గారిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికగా ఒక విలువైన పుస్తకాన్ని




బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ జాతీయ అధ్యక్షులు దీపక్ బహు నిఖాల్ జీ జన్మదిన వేడుకలు మరియు పార్టీ ఫౌండేషన్ డే కార్యక్రమాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. డాక్టర్ పిట్టా వరప్రసాద్ నాయకత్వంలో పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతం కావాలని అభిలషించారు. డాక్టర్ పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ, ఈ ఆత్మీయ సన్మానం తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని తెలిపారు.

# పచ్చని కొనయామకులే లక్ష్యం.. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు

## - మొక్కలను సంరక్షించిన కుటుంబాలకు ప్రత్యేక సత్కారం

## - గ్రామ సర్పంచ్ వజ్ర రాజు

గీసుగొండ, జూలై 25 హైదరాబాద్ ఎస్టేట్:
పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చే లక్ష్యంతో కొనయామకుల గ్రామపంచాయతీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాన్ని సంపూర్ణ హరిత గ్రామంగా తీర్చిదిద్దే సంకల్పంతో గ్రామ నర్సరీలో పెంచిన ఆరు రకాల మొక్కలను ప్రతి కుటుంబానికి ఆరు చొప్పున శనివారం గ్రామ సర్పంచ్ వజ్ర రాజు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వజ్ర రాజు మాట్లాడుతూ, చెట్ల పెంపకం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి వద్ద నాటిన మొక్కలు మహావృక్షాలుగా ఎదిగితేనే పర్యావరణ సమతుల్యత నెలకొని, సకాలంలో వర్షాలు కురవడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ రంగం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. చెట్లు ప్రకృతికి రక్షణ కవచమని, కరువు, వాతావరణ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కొనే శక్తిని సమాజానికి అందిస్తాయని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం ప్రతి కుటుంబ బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణలో ఆదర్శంగా నిలిచిన కుటుంబాలను గ్రామపంచాయతీ తరఫున ప్రత్యేకంగా గుర్తించి ఘనంగా సన్మానించడంతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. గ్రామాన్ని రాష్ట్రానికే ఆదర్శ హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, ఉప సర్పంచ్ పీసాల రాజేశ్వర్‌రావు, వార్డు సభ్యులు పీసాల రాధాబాయి, డోలే స్రవంతి, పోలీస్ విజయ, షాపురం మౌనిక, మార్గం రాజు, మార్గం వెంకటేష్, ఎం.డి. జహీరుద్దీన్, కారోబార్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్




మహమ్మద్, మాజీ ఉప సర్పంచ్ పీసాల నర్సింగరావు, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎం.డి. రహీం, తాబేటి నరేందర్, మాజీ వార్డు సభ్యులు పీసాల సుజాత, పోలీస్ వెంకటేష్, పీసాల రాధ, చిప్ప రమ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి, ప్రజాస్వామ్యానికి దక్కిన విజయం

## : డా. పిట్టా వరప్రసాద్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధికాకినాడ, జూలై 25:
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు సాగించిన ప్రజాస్వామ్య పోరాటానికి దక్కిన విజయమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డా. పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళన, విద్యా వ్యవస్థపై తగ్గిన విశ్వాసం వంటి పరిణామాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయడం ఆలస్యమైనప్పటికీ స్వాగతించదగ్గ పరిణామమని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎలాంటి రాజీ పడకుండా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (టీూా) పనితీరుపై స్వతంత్ర, పారదర్శక విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశంలో నిర్వహించే అన్ని జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా, సాంకేతికంగా పటిష్టంగా, అవినీతికి ఆస్కారం లేకుండా నిర్వహించే విధంగా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని డా. పిట్టా వరప్రసాద్ స్పష్టం చేశారు.

# శ్రీ బీరన్న స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

## - ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం..

## - ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

## - ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

వరంగల్, జూలై 25 హైదరాబాద్ ఎస్టేట్:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీలో కురుమ కులస్థుల ఆరాధ్య దైవం శ్రీ బీరన్న స్వామి దేవాలయ నిర్మాణ పనులకు పరకాల శాసనసభ్యుడు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయూబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానం చేసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, దేవాలయాలు భక్తి, సంస్కృతి, సామాజిక ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. శ్రీ బీరన్న స్వామి దేవాలయ నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కురుమ సంఘం నాయకులు, భక్తులు, కాలనీవాసులు





తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఐక్య ఉద్యమ విజయమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

## సోమిడి శ్రీనివాస్

హనుమకొండ, జూలై 25 హైదరాబాద్ ఎస్టేట్:
దేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్య ప్రజా ఉద్యమాలే అత్యంత ప్రభావవంతమైన మార్గమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థుల ఐక్య



ఉద్యమాల ఒత్తిడి ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో రైతులు సాగించిన చారిత్రాత్మక ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని వివాదాస్పద వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునేలా చేసినట్లే, నేడు విద్యార్థుల ఐక్య పోరాటం కూడా ప్రజా ఉద్యమాల శక్తిని దేశానికి చాటిచెప్పిందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సంఘటిత ప్రజా పోరాటాల ద్వారానే ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి తలొగ్గే పరిస్థితులు ఏర్పడతాయని వ్యాఖ్యానించారు. రైతాంగం కుల, మత, పార్టీ భేదాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమిస్తే రైతుల హక్కులను శాశ్వతంగా సాధించుకోవచ్చని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రైతు దుక్కి దున్నిన నాటి నుంచి పంట ఉత్పత్తి, నిల్వ, రవాణా, ప్రభుత్వ కొనుగోలు, గిట్టుబాటు ధరతో విక్రయం వరకు పూర్తి బాధ్యతను ప్రభుత్వమే చట్టబద్ధంగా స్వీకరించే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, విద్యార్థులు, కార్మికులు, ప్రజాసంఘాలు ఉమ్మడి లక్ష్యంతో ఐక్యంగా పోరాడినప్పుడే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సోమిడి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# పరిశుభ్ర పరకాలే లక్ష్యం..

## - వ్యాపారుల సహకారంతోనే పట్టణాభివృద్ధి - మార్కెట్లలో సీసీ కెమెరాలు, లైటింగ్..

## - చేపల మార్కెట్‌కు ప్రత్యేక స్థలం - ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

పరకాల, జూలై 25 హైదరాబాద్ ఎస్టేట్:
పరిశుభ్రమైన, ప్రణాళికాబద్ధమైన పరకాల పట్టణ నిర్మాణానికి చిరు వ్యాపారులు, ప్రజల సహకారం అత్యంత కీలకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌ను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన మార్కెట్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వ్యాపారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని కచ్చితంగా పాటిస్తూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులకు, వ్యాపారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు మార్కెట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ఆధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చేపల మార్కెట్ రహదారి పక్కన ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా అన్ని మౌలిక వసతులతో కూడిన ప్రత్యేక స్థలాన్ని గుర్తించి చేపల మార్కెట్‌ను తరలిస్తామని వెల్లడించారు. చిరు వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి వారి ప్రయోజనాలను కాపాడుతామని స్పష్టం చేశారు. పారిశుధ్య నిబంధనలు ఉల్లంఘిస్తూ రహదారులపై చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించిన ఎమ్మెల్యే, ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్ర,



ప్రగతిశీల పరకాల నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మార్కెట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతితో బదిలీపై వెళ్తున్న ఎస్సై సత్తయ్యకు ఘన సన్మానం

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణం లోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై)గా విధులు నిర్వహించి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా పదోన్నతి పొంది, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఆదిమూలం సత్తయ్యకు ఘనంగా వీడ్కోలు




పలికారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్శ రమేష్, మందమరి ఎస్సై నరేష్, రామకృష్ణాపూర్ ఎస్సై జాడి శ్రీధర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ, ఆదిమూలం సత్తయ్య తన విధులను నిబద్ధత, నిజాయితీతో నిర్వహించి ప్రజలకు, శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. పదోన్నతి పొంది కొత్త బాధ్యతల్లో కూడా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సత్తయ్య సహచర అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తాను ఎక్కడ పనిచేసినా అదే అంకితభావంతో విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

## మంఖాల్ ప్రాథమిక పాఠశాలలో ఆకస్మికంగా కనిపించేసిన విద్యాధికారి వెంకటేశ్వర్లు



( హైదరాబాద్ ఇస్తే రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 25:)
మహేశ్వరం మండలంలోని ప్రాథమిక పాఠశాల మంఖాల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి
రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మహేశ్వరం మండలంలోని ప్రాథమిక పాఠశాల, మంఖాల్ ను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస స్థాయిలు,(ఎఫ్ఎల్ఎన్) (ఫౌండేషనల్ లీటరసీ & నూమ్రెసీ ) కార్యక్రమం అమలు, తరగతి గది బోధన, లైబ్రరీ నిర్వహణ, విద్యార్థుల నోట్‌బుక్స్, బోధనా విధానాలు, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివిధ ప్రశ్నలు అడిగి వారి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు, సాధారణ అవగాహనను స్వయంగా పరీక్షించారు.విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణతో చదవాలని, ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని, తల్లిదండ్రులు మరియు పెద్దలను గౌరవించాలని, మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.అదేవిధంగా ఉపాధ్యాయులకు విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, (ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని, లైబ్రరీ వినియోగాన్ని మరింత పెంపొందించాలని, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని పలు సూచనలు చేశారు.ఈ తనిఖీలో మహేశ్వరం మండల విద్యాధికారి డా. వి. కస్నా నాయక్ పాల్గొని పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలపై వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి. రేణుక , వనజ పాల్గొని జిల్లా విద్యాశాఖ అధికారి సూచనలను స్వాగతిస్తూ పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అధికారులతో ఆత్మీయంగా ముచ్చటించడం విశేషంగా నిలిచింది.

## నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం




హైదరాబాద్, జూలై 25: బర్కత్ పుర లోని జీవశ్రీ ఆయుర్వేదిక్ వెల్నేస్ కేంద్రంలో ఈనెల 26వ తేదీన ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జి.సత్యదీప తెలిపారు. వైద్య శిబిరంలో బిఎండి స్క్రీనింగ్, ఆయుర్వేద కన్సల్టేషన్, ఎముకల ఆరోగ్య మార్గదర్శనం, ఉంటుందని తెలిపారు. శాస్త్రీయంగా ఆయుర్వేదంపై ప్రజలు అవగాహన కలిగి ఉండటం అవసరమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన పురాతన ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
వివరాలకు సెల్: 8121005684.

## ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకున్న జిల్లా విద్యాధికారి రాజు



మెదక్ జిల్లా,జూలై 25(హైద్రాబాద్ ఎస్టేట్): తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన ఈఏడుపాయల వనదుర్గామాతను శనివారం రోజు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్ట మొదటిసారిగా అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ పండితులు శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.డిఇఓ రాజుకు వేద పండితులు ఏడుపాయల ఆలయ ప్రశస్తిని వివరించారు. ఆయన వెంట అక్షయ పాత్ర మెదక్ ప్లాంట్ మేనేజర్ త్రిపాఠి,పవన్ కుమార్, రాకేష్ కుమార్,భట్టు నాగరాజు,వికాస్ రాజు, బత్తిని రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నపేట పాతూరు శ్రీ వెంకటేశ్వరాలయంలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు





మెదక్ జిల్లా,జూలై 25(హైద్రాబాద్ ఎస్టేట్):మెదక్ జిల్లా,పాపన్నపేట మండల కేంద్రంలో పాతూరు శ్రీ వెంకటేశ్వరాలయంలో శనివారం రోజు తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఉదయాన్నే ఆలయ అర్చకులు చెరువు పల్లి విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులు దర్శించుకుని స్వామీ వారికి మొక్కలు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈసందర్భంగా విశ్వనాథ శర్మ మాట్లాడుతూ ఏకాదశి రోజున ఉపవాసం, దానం,జపం వల్ల సకల సంపదలు కలుగుతాయనీ, కుటుంబంలో సుఖ శాంతులు నెలకొంటాయని ఆయన వెల్లడించారు.తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పాపన్నపేట ఆలయ పరిసరాలన్నీ వెంకటేశ్వర నామస్మరణతో మారు మ్రోగింది.ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన ఏకలవ్యుని జయంతి కార్యక్రమం.

## మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధిచిలకలూరిపేట/జులై 25.
మహాభారతంలో ఏకలవ్యుడు నిషాద (అటవీ) తెగకు చెందిన యువరాజు, గురుభక్తికి, అసాధారణ ఏకాగ్రతకు ప్రతీకాగ నిలుస్తారని
శనివారం రాష్ట్ర గిరిజన సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి మోట రాముడు,సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ విలువిద్య నేర్చుకోవాలనే బలమైన కోరిక ఉండేదన్నారు. అప్పట్లో రాజకుమారులకు మాత్రమే విలువిద్య నేర్పుతున్న ద్రోణాచార్యుని ఆశ్రయించి, తనను శిష్యుడిగా స్వీకరించమని ఏకలవ్యుడు
కోరాడు. అయితే క్షత్రియులు కాని వారికి ఆ విద్య నేర్పడానికి ద్రోణుడు నిరాకరిస్తారు.నిరాశ చెందినప్పటికీ ఏకలవ్యుడు పట్టు వదలకుండా ద్రోణాచార్యునిపై ఉన్న అపారమైన గౌరవంతో ఆయన మట్టి విగ్రహాన్ని తయారు చేసుకొని, దానినే తన గురువుగా భావించి రోజూ సాధన చేసి అర్జునుడిని మించిన స్థాయికి విలువిద్యలో చేరుకుంటారని తెలిపారు.
ద్రోణాచార్యుని ఆశ్రమం వైపు నుంచి శునకాలు తన వైపు రావడంతో తన దగ్గర ఉన్నటువంటి బాణాలతో ఆ స్వర్గం నోరు మోయిస్తాడు. విద్యను చూసి ఆశ్చర్య పోయిన ద్రోణాచార్యుడు అర్జునుడికి పోటీగా నిలుస్తారని భావించి గురుదక్షిణగా అతని కుడి చేతి బొటన వేలును ఇవ్వమని అడగడంతో కోసి సమర్పించుకుంటాడు. బొటనవేలు లేకపోయినా విలువిద్యను అభ్యసించిన ఆయన నిషాధ రాజ్యానికి రాజుగా ఎదుగుతారని ఆ తదుపరి జర సంధుని సైన్యంలో చేరి శ్రీకృష్ణుడిని ఎదిరించినప్పుడు ఆయన చేతిలో మరణించడం జరుగుతుంది. వారి ఆదర్శాలు నేటి యువతరానికి తెలియజేయడం కోసం ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి రోజున ఆయన జయంతి కార్యక్రమాని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి ముందుగాపట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్నటువంటి ఏకలవ్యుని విగ్రహానికి, మండలంలోని కావూరు గ్రామంలోని గల ఏకలవ్య కాలనిలో ఏకలవ్యుని విగ్రహానికి
పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ తదుపరి తొమ్మిది మందితో కూడిన కమిటీని చిలకలూరిపేట నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కుంభ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు, పాలపర్తి శివశ్రీనివాసరావు,ప్రధాన



కార్యదర్శి- గోపి నాయక్, సహమకార్యదర్శి మేడా సుబ్బారావు, కోకాధి కారి- పాలపర్తి శ్రీనివాసరావు కమిటి సభ్యులుగా దేవరకొండ గోపి, కుంభ నాగేశ్వరరావు,నాగేశ్వరరావు నాయక్, శివయ్యలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటానికి, రాహుల్ గాంధీ గారి నాయకత్వానికి దక్కిన చారిత్రాత్మక విజయం

## : హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి భాస్కర్ హనుమకొండ
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో హనుమకొండలో ఘనంగా 'విజయ్ మార్చ్' (విజయ యాత్ర).
పబ్లిక్ గార్డెన్ గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ క్యాండిల్ లైట్ మార్చ్.
ఈ విజయం దేశ యువతకు, విద్యార్థులకు మరియు రాహుల్ గాంధీ గారి అలుపెరగని పోరాటానికి అంకితం.
హనుమకొండ: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో ఏఐసిసి జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో ఘనంగా 'విజయ్ మార్చ్' (విజయ యాత్ర) నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీజీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ భారీ క్యాండిల్ లైట్ మార్చ్, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ విజయ్ మార్చ్ ను దేశవ్యాప్త విద్యార్థులకు, యువతకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. వారి ధైర్యం, పట్టుదల వల్లే ఈ చారిత్రాత్మక విజయం సాధ్యమైందన్నారు.
దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారు విద్యార్థుల పక్షాన నిలిచి నిరంతరం చేసిన పోరాటం, పడిన శ్రమ నేడు ఫలించాయని ఆయన కొనియాడారు. పార్లమెంట్ లోపలా, బయటా రాహుల్ గాంధీ గారు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ, విద్యార్థుల గొంతుకై పోరాడడం వల్లే చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగివచ్చి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. ఇది ముమ్మాటికీ రాహుల్ గాంధీ గారి అలుపెరగని నాయకత్వానికి, దేశవ్యాప్త విద్యార్థుల ఆగ్రహానికి దక్కిన చారిత్రాత్మక నైతిక విజయమని ఆయన స్పష్టం చేశారు.
కేంద్ర మంత్రి రాజీనామా చేసినప్పటికీ, విద్యార్థుల మిగిలిన పెండింగ్ డిమాండ్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొని మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలోటిపిసిసి మెంబర్ యివి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, హనుమకొండ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఛైర్మన్ పింగిలి వెంకట్రామ్




రెడ్డి, గ్రేన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి ప్రియాంక, శ్రీమతి గోదా దేవి, ꟸజ జాతీయ కార్యదర్శి శ్రీమతి సాగరిక రావు గారు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, ఛైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు,టిపిసిసి కమిటీ మెంబర్లు, డివిజన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, =ఉూ=ూ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, చీూఖ× నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేవలం ఒక మంత్రి రాజీనామాతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేతులు దులుపుకోలేదని, పేపర్ లీకేజీల వల్ల తీవ్రంగా నష్టపోయిన ప్రతీ విద్యార్థికి పూర్తి న్యాయం జరిగే వరకు ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల ప్రకారం కాంగ్రెస్ శ్రేణులు వీధుల్లో పోరాడుతూనే ఉంటాయని హెచ్చరించారు

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

## ప్రధాని మోడీకి లేక పంపిన మంత్రి దేశ రాజకీయాల్లో భారీ సంచలనం .

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగీ అశోక్ ,
నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో యువత ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చింది. నీట్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజనామా లేఖను ప్రధాని నరేంద్ర మోడీకి పంపించారు. మరో గంటలో కేంద్ర ప్రభుత్వంతో (జజ్బీ) ప్రతినిధుల మూడో విడత చర్చలు జరిగే గంటలకు ముందు ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది.
రాజీనామా సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ ఓ లేఖను తన సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. గత పది రోజులుగా జరుగుతున్న పరిణామాల తనను బాధించాయని నేను వ్యక్తిగత ప్రతిష్టకు పోవడం లేదని ఈ లేఖలో పేర్కొన్నారు. దేశ యువతను గందరగోళంలోకి చిక్కుకోనివ్వనని విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మనస్థాపితం కలిగించాయన్నారు. నేను ఎప్పుడూ నా బాధ్యతల నుంచి తప్పించుకోలేదని ,యువ శక్తి ,ఈ దేశం అసలైన శక్తి అన్నారు, యువత భవిష్యత్తు కోసమే రాజీనామా చేశానని దేశ విద్రోహ శక్తులకు అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. యువత తమ చదువు కోసం సమయం కేటాయించాలని మంత్రిగా ఎన్నాళ్లు నాకు అవకాశం కల్పించిన మోడీకి కృతజ్ఞతలు తెలిపారు, దేశ సేవకు నా అత్యున్నత ప్రధాన్యత అన్నారు. నీట్ అక్రమాల వెలుగులోకి రాగానే సిబిఐ విచారణకు ఆదేశించమని విజయవంతంగా నీట్ రీ రీ ఎగ్జామ్ నిర్వహించాలన్నారు. (జజ్బీ) నేతృత్వంలో యువత ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 36 రోజులుగా నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్ ను పోలీసులు ఆసుపత్రికి తరలించడం ఈనెల 20వ తేదీన కాక్రోస్ జనతా పార్టీ ఇచ్చిన చలో పిలుపు సందర్భముగా నిరసనకారులపై పోలీసులు లాటి చార్జీ



ప్రయోగించడంతో ఉద్యమం మరింత ఉద్భుతమైశీది. విద్యార్థులపై పోలీసుల దాడికి నిరసనగా ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి ఈ క్రమంలో ప్రభుత్వం ఇప్పటికే రెండు దఫాలుగా కాక్రోస్ జనతా పార్టీ ప్రతినిధులతో చర్చలు జరపగా ఇవాళ మూడో విడత చర్చలు జరగాల్సి ఉంది ఇంతలోనే ధర్మేంద్ర ప్రధాను రాజీనామా చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

26 ఆదివారం జూలై 2026

# BRS పార్టీ తెలంగాణ భవనంలో మొట్టమొదటిసారి ఏకలవ్య జయంతికి వేడుకలకు ఆహ్వానం

## . రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహా





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్ పార్టీ.తెలంగాణ భవనంలో మొట్టమొదటిసారిగా కోనేటి నరసింహ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో. ఏకలవ్యుడు జయంతి 25. శనివారం ఉదయం 9 గంటలకు దీ =ా పార్టీ కార్యాలయంలో జరుపుతున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఏ పాలకులు గాని ఎరకల ప్రజలను పట్టించుకోని దాఖలాలు లేవు.తెలంగాణ ఏర్పటంక తెలంగాణ ఉద్యమంలో ఎరుకల ప్రజల ను గుర్తించి. మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట చంద్రశేఖర రావు గారు ప్రస్తుతం మాజీ సీఎం గారు ఎరుకల ప్రజలను గుర్తించి. ఎరుకల ఆరాధ దైవమైన ఎరుకల నాంచారమ్మ ను భువనగిరి& యాదాద్రి జిల్లా పోచంపల్లి మండలం. పిల్లాయిపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వంచే ఎరుకల నాంచారమ్మ జాతరను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించడం జరిగింది . అట్లాగే ఎరుకల జీవనోపాధి కనుమరుగు అయిపోతుంది కాబట్టి ఎరుకల యువతను కార్పొరేట్ స్థాయిలో వ్యాపారం చేయాలని పిగ్ ఎంఫోవర్మెంటు స్కీం కింద 60 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. అట్లాగే ఎరుకల ఆత్మ గౌరవం కోసం నిజాంపేట హైదరాబాదులో 1/20 ఎకరం నర భూమి ఇచ్చి. 3 కోట్ల రూపాయలు తో ఎరుకల ఆత్మగౌరభవనం నిర్మించడం జరిగినది. ఎరుకల ప్రజలు రాజకీయంగా వెనుక పడుతున్నారు కాబట్టి. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎంపీటీసీలు సర్పంచులు జెడ్పిటిసిలు స్థానిక నామినేటెడ్ పదవులు మార్కెట్ డైరెక్టర్లు కేటాయించడం జరిగింది . అలాగనే బిఆర్ఎస్ పార్టీ ఎరకర ప్రజలను రాజకీయంగా వెనుకబడుతున్నావు కాబట్టి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ప్రకటించడం జరిగింది. కుట్రలో భాగంగా వారే కారణాలవల్ల బిజెపి కుట్ర తోటి తిరస్కరించబడినది. బిఆర్ఎస్ పార్టీ అధినాయకత్వాన్ని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం కోనేటి నరసింహా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో మాజీ మంత్రివర్యులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు గారిని మరియు తన్నీరు హరీష్ రావు గారిని మాజీ మంత్రివర్యులు మరియు గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి గారిని ఒప్పించి తెలంగాణ భవనంలో ఎరుకల రాజకీయ ఆత్మగౌరవం కోసం ఒప్పించడం జరిగినది మొట్టమొదటిసారిగా తెలంగాణ వి ఆర్ ఎస్ పార్టీ భవనంలో తెలంగాణ ఏకలవ్య జయంతిని జరపాలని దీ=ా పార్టీ నిర్ణయించడం జరిగినది వారి ఆదేశాల మేరకు అందరికీ ఇన్విటేషన్ ఇవ్వడం జరిగినది ఏకలవ్య జయంతి వేడుకలు పాల్గొనడానికి అలాగనే ముఖ్యఅతిథిగా మాజీ మాజీ మంత్రివర్యులు శాసనసభ్యులు ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు గారు మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంతకంట్ల జగదీశ్వర్ రెడ్డి గారు తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ గారు శాసనసభ్యులు మాజీ శాసనసభ్యులు హాజరవుతున్నారు

. కావున తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ. అన్ని జిల్లా అధ్యక్షులు. రాష్ట్ర నాయకులు ముఖ్య నాయకులు. హాజరుకావాలని .కోనేటి నరసింహ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపునివ్వడం జరుగుతుంది ఆధ్వర్యంలో జరుపుతున్నాము

మీరు పిలుపునివ్వడం జరుగుతుంది

ఇట్లు
కోనేటి నరసింహ
రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ.
చీశేవ. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ట్యాంక్ ఇవ్వండి పై ఏకలను జయంతి.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

## : ఎల్బీనగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల నిరసన

టనీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఈ వ్యవహారం కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులు, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

టకాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీక్ వంటి అక్రమాల వల్ల వారి శ్రమ, ఆశలు, భవిష్యత్తు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.టపేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, నీట్ పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావాలని కోరారు.

టఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డ సత్యనారాయణ, మన్సూరాబాద్ డివిజన్ సీనియర్ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్, అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ నాయకులు కూరెళ్ల వేములయ్య గౌడ్, కడారి బాలకృష్ణ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టవిద్యార్థులకు, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# విద్యుత్ వినియోగంలో ప్రజలు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలి

## - విద్యుత్తు శాఖ ఎస్.ఈ రమేష్,

విద్యుత్ వినియోగంలో ప్రజలు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని విద్యుత్తు శాఖ ఎస్ ఈ రమేష్ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి సర్కిల్ పరిధిలోని రేగొండ సెక్షన్‌లోని నిజాంపల్లి గ్రామంలో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ రమేష్ గ్రామస్థులకు విద్యుత్ లైన్లకు సమీపంలో అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక కనెక్షన్లు తీసుకోవద్దని, ఎలాంటి లోపాలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు విద్యుత్తు సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# దండు లక్ష్మి ప్రధమ వర్ధంతి


## - డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్,



వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో పిఆర్ ముదిరాజ్ సేవా సమితి ఫౌండర్ దండు చిరంజీవి ముదిరాజ్ తల్లి దండు లక్ష్మి ప్రధమ వర్ధంతి కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గం ఇంచార్జ్, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ తో పాటు బీసీ సంఘం నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు లక్ష్మి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, జిల్లా నాయకులు తోటకూర రాజు యాదవ్, జినుకల విజేందర్ ముదిరాజ్, నర్సంపేట పట్టణ కార్యదర్శి శీరంశెట్టి రాజేందర్ పెరక పి ఆర్ ముదిరాజ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు పెసరు రాజన్న, రాష్ట్ర నాయకులు పులి సదానందం ముదిరాజ్, సింగారపు రామకృష్ణ, శ్రీనివాస్, పోలుదాసరి రమేష్, ముద్రబోయిన రమేష్, కుమారస్వామి, ప్రహ్లాద్, లోకేశ్వర్, బోడ కుమార్, తాడెం వినయ్, రాజు, డివిజన్ అధ్యక్షుడు ముద్రబోయిన రమేష్, ఓరుగంటి తిరుపతి, జట్టబోయిన రాజు, దండు నరసయ్య, ఎద్దు కృష్ణ రాజు, నరారి సంపత్, బైరి రఘు, దండు రవి తదితరులు పాల్గొన్నారు,

# ఈ నెల జూలై 31లోగా ఈ-కేవైసి (E`KYC) పూర్తి చేసుకోవాలి

## - తహసీల్దార్ కొత్తపల్లి గోరి హేమ,



జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి భూపాలపల్లి ఆదేశాల మేరకు రేషన్ కార్డు దారులు కానీ,వారి కుటుంబ సభ్యులు కానీ ఇంకా ఎవరైనా ఈ కేవైసి పూర్తి చేయనట్లయితే ఈ నెల జూలై 31 వ తేదీ గడువు లోగా పూర్తి చేసుకోనేలా చర్యలు చేపట్టాలని కొత్తపల్లి గోరి తహసీల్దార్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సమావేశం లో తహసీల్దార్ హేమ డీల్లర్ల ను ఆదేశించారు. ఈ–కేవైసి ఇంకా పూర్తి చేయని రేషన్ కార్డు దారులు మరియు వారి కుటుంబ సభ్యుల జాబితాలను కూడా డీలర్లకు అందజేయడం జరిగిందని ఈ చివరి అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరినారు. ఈ సమావేశంలో నాయబ్ తహసీల్దార్. బి శ్రీలత మండలంలోని రేషన్ డీలర్లు జయప్రకాశ్, బిక్షపతి, తిరుపతి,, రాజేంద్రప్రసాద్,పాణి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు తర్వాత పూర్తి చేయాలి

## - పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు,




భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, రికార్డులు, పిటిషన్లు, కేసు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల నుంచి స్వీకరించే పిటిషన్లను సకాలంలో పరిశీలించి, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అలాగే స్టేషన్‌లోని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తులో నాణ్యతను పాటిస్తూ చట్టపరమైన విధానాలకు అనుగుణంగా కేసులను విచారించాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదైన కేసుల స్థితిగతులను (Case Status) పరిశీలించి, దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.







